క్లుప్తంగా

సాధికార బస్సు యాత్రతో నూతనోత్సాహం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: దేవరపల్లిలో ఆదివారం జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సవం ఏర్పడిందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి బస్సు యాత్రలో పాల్గొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంఘీభావం తెలిపారని ఆయన అన్నారు. సోమవారం రాత్రి దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద విలేకర్లతో మాట్లాడారు. యాత్ర విజయవంతం కావడానికి సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ), స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, పోలీస్ అధికారులు, గృహ సారధులు, వలంటీర్లు, కు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కృతజ్ఞతలు తెలిపారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



కొవ్వూరు ఎస్సీ బాలుర వసతిగృహం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న సందీప్

కొవ్వూరు: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి సందీప్ సూచించారు. సోమవారం రాత్రి పట్టణంలో ఎస్సీ బాలుర వసతి గృహంలో కానూరు, తాళ్లపూడి, అన్నదేవరపేట, ఖండవల్లి, ఉండ్రాజవరం, కొవ్వూరు బాల,బాలికలు, సమిశ్రగూడెం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ను అందజేశారు. ఏఎస్‌డబ్ల్యూ బీఎస్ మేరీమాత, హాస్టల్ సంక్షేమ అధికారులు ముప్పిడి రాజు, ఎన్.నాగభూషణం, కె.శ్రీలత, యు.వినోద్, సబ్జెక్టు ట్యూటర్స్ పాల్గొన్నారు.

దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యం

నల్లజర్ల: విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ స్కౌట్స్, గైడ్స్ ఆర్గనైజేషన్ కమిషనర్ రాజశేఖర్ అన్నారు. సోమవారం దూబచర్ల సంఘమిత్ర స్కూల్‌ను పరిశీలించి, స్కౌట్ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులలో సేవాభావాన్ని పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం అన్నారు. ఈ ఉద్యమంలో విద్యార్థులంతా స్వచ్ఛందంగా చేరాలని కోరారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం, రోగగ్రస్తులకు సేవలు చేయడం, పోలీస్ వ్యవస్థ ద్వారా అత్యవసర సమయాల్లో సాయపడడం ద్వారా బాలలు సమాజ సేవ చేయవచ్చునన్నారు. స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు రాజశేఖర్‌ను సత్కరించారు. ఆయనతో పాటు నెక్కంటి వెంకటేష్, మురళీకృష్ణ, శిక్షకులు నాగేంద్రబాబు, నాగిరెడ్డి, మణికంఠ పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలి

ఉండ్రాజవరం: దివ్యాంగులను ప్రేమతో ఆదరించాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి పేరూరి పూర్ణాచార్యులు అన్నారు. 42వ ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తణుకు బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలో ఉండ్రాజవరం, పాలంగి గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉండ్రాజవరంలో బి.సుబ్బమ్మ, ఎస్.అప్పారావు సేవాసదన్ వృద్ధాశ్రమానికి రూ.5 వేలు నగదును అందజేశారు. పాలంగిలో స్పందన దివ్యాంగుల కేంద్రంలోని పిల్లలకు 38 దుప్పట్లు, రగ్గులు, 8 బస్తాల బియ్యం, 15 లీటర్ల వంట నూనె, పండ్లు అందజేస్తారు. తొలుత పింఛను అనేది ఒక హక్కుగా సాధించి పెట్టిన డీఎస్ నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పూర్ణచార్యులు మాట్లాడుతూ బ్రాంచ్ సభ్యుల సహకారంతో రూ.53 వేలు వెచ్చించి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజనల్ ప్రధానకార్యదర్శి ఎం.అప్పలాచార్యులు, కోశాధికారి టి.సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి బోడ్డు విక్టర్ బాబు, తణుకు బ్రాంచ్ సభ్యులు పాల్గొన్నారు.

రక్షణ సేవా సమితి వితరణ



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న సభ్యులు

గోపాలపురం: స్థానిక రక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో 12వ ఐక్య క్రిస్మస్ సందర్భంగా సోమవారం 150 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేసారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పిలప్ ఫెయిత్ మినిస్ట్రీస్ అధినేత రెవరండ్ ఎస్ జాఘవా మాట్లాడుతూ రక్షణ సేవాసమితి చేస్తున్న సేవలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. సంస్థ అధ్యక్షుడు గెల్లా ఏలీషా, టి.ఏసురాజు, దాసరి రామారావు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



పెరవలిలో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



సమిశ్రగూడెం శివాలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



చాగల్లులో అలరించిన కోలాట ప్రదర్శన



కొవ్వూరు ఏటిగట్టుపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయం వద్ద దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి

- స్వామివారికి అభిషేకాలు, పూజలు
- కిక్కిరిసిన ఆలయాలు

నిడదవోలు: పట్టణంలోని చినకాశిరేవులో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సోమవారం షష్ఠి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, సుమలత దంపతులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బాలసుబ్రహ్మణ్యం స్వామివారి ఆలయంలో కూడా పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. నిడదవోలు పట్టణంతోపాటు రూరల్ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పశ్చిమడెల్టా ప్రధాన కాలువ చినకాశిరేవులో భక్తులు వేకువజామున గంగా స్నానాలు చేసి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పూజలు చేశారు. నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో ప్రధాన రహదారి ఇరువైపులా షష్ఠి దుకాణాలు ఏర్పాటుకు పోలీసులు అనుమతులు ఇచ్చారు. ఆలయంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ, చిలకల శారదా దేవి పూజలు చేశారు.

నిడదవోలు రూరల్: తాడిమళ్ల, రావిమెట్ల గ్రామాల్లో శ్రీవల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సమిశ్రగూడెంలో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పెండ్యాల, పందలపర్రు, కంసాలిపాలెం, కాటకోటేశ్వరం గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



నిడదవోలు పట్టణంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, సుమలత దంపతులు

పెరవలి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్నవరప్పాడులో సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. సుమారు అర కిలోమీటరు వరకు క్యూలైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. కానూరులో జరిగిన ఉత్సవాల్లో వేలాది మంది పాల్గొనడంతో నిడదవోలు–నర్సాపురం ఆర్అండ్‌బీ రహదారి భక్తులతో నిండి ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. ముక్కామలలో సుబ్రహ్మణ్యేశ్వస్వామి, అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించారు.

తాళ్లపూడి: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు దర్శించి పూజలు చేశారు. పెద్దేవంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తోట రామకృష్ణ, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, నాయకులు తదితరులు పూజలు చేశారు. ప్రక్కిలంకలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. వేగేశ్వరపురంలోని చాయా సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాగోలపల్లి, తాడిపూడి, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, గజ్జరం గ్రామాల్లో షష్ఠి వేడుకలను నిర్వహించారు.

చాగల్లు: స్థానిక ప్రధాన కూడలిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు. చిక్కాల, ఊనగట్ల, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో షష్ఠి వేడుకలు వైభవంగా జరిగాయి.

కొవ్వూరు: పట్టణంలో ఏటిగట్టుపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి దర్శించి పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గోష్పాదక్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయంలోను, సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో ఉన్న ఉప ఆలయాల్లోను సాయంత్రం స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది.



చాగల్లులో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి

దేవరపల్లి: స్థానిక వల్లీదేవ సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి పండ్లు, పలహారాలు అందజేశారు. మండలంలో యాదవోలు, యర్నగూడెం. త్యాజంపూడి, కురుకూరు, బందపురం, దుద్దుకూరు, గౌరీపట్నం తదితర గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి దేవరపల్లిలో స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై సిబ్బందికి అవగాహన

ఉండ్రాజవరం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఇప్పటి వరకు రూ.5లక్షల వరకు చికిత్స నిమిత్తం ఉండగా ఇప్పుడు దాన్ని రూ.25 లక్షలకు పెంచినట్టు ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యులు రాజనాల ప్రసాద్ అన్నారు. పాలంగి సచివాలయంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై సిబ్బంది, వలంటీర్లు, ప్రజలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఈపథకం కింద ఇక నుంచి రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం అందించే కార్యక్రమంతోపాటు సరికొత్త ఫీచర్లతో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల జారీ చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వారు టీవీల ద్వారా వీక్షించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి ఇంటింటికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్డులు ఇస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌వీ నాగమణి, ఎంపీహెచ్ఏఎం కాపా నాగరాజు, ఎఫ్ పద్మా, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

22న డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నిడదవోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన నిడదవోలు నియోజవర్గస్థాయి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో శ్రీ రామ్ ఫైనాన్స్, మెడ్ ప్లస్, అపోలో ఫార్మసీ, ఆక్సిస్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్, ఫ్లిప్‌కార్టు, నవత ట్రాన్స్‌పోర్టు కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఎంకాం, ఎంబీఏ, డిగ్రీ, ఫార్మసీ, ఇంటర్, పదో తరగతి పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగ యువత అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ బయోడాటా ఆధార్ కార్డుతో పాటు అర్హత కలిగిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఈనెల 22న శుక్రవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9676052454, 7393740041 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

27 వరకూ 'వై ఏపీ నీడ్స్ జగన్'

కొవ్వూరు: మండలంలో ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తెలిపారు. 19న నందమూరు, 20న పశివేదల–1 సచివాలయం, 21న పశివేదల–2 సచివాలయం, 22న తోగుమ్మి, 26న వాడపల్లి–1 సచివాలయం, 27న వేములూరు గ్రామం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నిడదవోలు రూరల్: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్ సీపీ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. తాడిమళ్ల గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. తాడిమళ్ల గ్రామ పరిధిలో రూ.36.40 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.14.30 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల డిజిటల్ బోర్డులను పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సర్పంచ్ బయ్యే రాధారాణి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను పల్లారావు ఎగురవేసి సంక్షేమ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పెనుగొండ కృష్ణమోహన్, సొసైటీ అధ్యక్షుడు చింతల సీతారామయ్య, పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నాయకులు కాగిత లక్ష్మయ్య, సత్తిపండు, కొప్పుల రామదేవుడు, తిరుమళ్ల దుర్గారావు, లక్ష్మణరావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో..

తాళ్లపూడి: వేగేశ్వరపురం సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్‌పోశిన శ్రీలేఖ పార్టీ జెండా, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు.



తాడిమళ్లలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

సర్పంచ్ కె.పరశురామారావు, మండల కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వి.శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేచెర్లలో...

కొవ్వూరు: ఐ.పంగిడి శివారు గ్రామం దేచెర్లలో సోమవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం (ఏపీ జగనే ఎందుకు కావాలంటే) నిర్వహించారు. సచివాలయం వద్ద లబ్ధిదారులకు అందిన వివరాలను తెలిపే బోర్డును స్థానిక సర్పంచ్ గోశాల నాగర్జున, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చొటుపల్లి వీరన్నలు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాలు చేతపట్టుకుని ఇంటింటి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు తెలియజేశారు. అంతకు ముందు సచివాలయం సమీపంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేశారు.మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు బాలశంకరం పంతులు, సురేష్, ఎంపీడీవో కె.సుశీల పాల్గొన్నారు.



వేగేశ్వరపురంలో గ్రామ సభ నిర్వహిస్తున్న నాయకులు

నందిగంపాడులో...

చాగల్లు: నందిగంపాడు సచివాలయ పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి పాల్గొని ఇంటింటికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో పల్లె నిద్ర చేశారు. మండల పార్టీ అధ్య క్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి శివ, నందిగంపాడు సర్పంచ్ కుదప రాంబాబు, మట్టా వెంకట్రావు, తాళ్లూరి సత్యనారాయణ, బండి అశోక్‌బాబు, కంకటాల శ్రీనివాస్,చిలీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవంతమైన నియోజకవర్గంగా నిడదవోలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- ఉసులుమర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం

పెరవలి: జిల్లాలో నిడదవోలు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని, అందుకోసం ఇప్పటివరకు రూ.2 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పనులు చేశామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పేర్కొన్నారు. ఉసులుమర్రులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామంలో ఏది చేసినా టీడీపీ, జనసేన నాయకులు రాజకీయం చేయటానికి ప్రయత్నిస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ న్యాయం చేసిందన్నారు. ఈ ప్రభుత్వంలో సొంతిల్లు లేని పేదవాడు ఉండకూడదని, సంక్షేమం పథకాలు అందని కుటుంబం ఉండకూడదని ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే ఈ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గెలుపించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్టి రాంబాబు, మండల గృహసారధుల అధ్యక్షులు రామడుగుల సూర్యనారాయణ, సర్పంచ్ వీరమళ్ల భూలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షులు దొలూరి శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉసులుమర్రులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

క్రైస్తవుల సంక్షేమానికి రూ.400 కోట్లు

- క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ
- లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు

నల్లజర్ల: క్రైస్తవుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.400 కోట్లు ఖర్చు చేసిందని క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టరు బొల్లవరపు జాన్‌వెస్లీ వెల్లడించారు. ఆదివారం రాత్రి ప్రకాశరావుపాలెంలోని క్రైస్తు లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ క్రైస్తవులందరూ మంచి మనసుతో ఉండాలన్నారు. క్రైస్తవులపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. పాస్టర్లకు మూడో విడత గౌరవ వేతనం విడుదలయ్యేలా కృషి చేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా క్రైస్తవ మైనార్టీలను ఆదుకున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. శ్మశాన వాటికలు, కమ్యూనిటీ హాల్స్‌కు నిధులు విడుదల చేయనున్నట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా కూర్చోబెట్టే బాధ్యత మనందరిపై ఉందన్నారు. మరో ముఖ్యఅతిథి రాబిన్ పాల్ కూడా సభలో ప్రసంగించారు. అనంతరం వృద్ధులకు దుస్తులు అందజేశారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జాన్‌వెస్లీని ఘనంగా సత్కరించారు.



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ

దేవరపల్లిలో ఆర్అండ్‌బీ కార్యాలయం ఏర్పాటు

దేవరపల్లి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెట్ట ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్న దేవరపల్లికి ప్రభుత్వ కార్యాలయాలు తరలివస్తున్నాయి. ఇప్పటికే మండల కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న దేవరపల్లిలో అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించారు. అయితే రాష్ట్రంలో హైవేల కిల్లాగా దేవరపల్లి అభివృద్ధి చెందుతోంది. గుండుగొలను–కొవ్వూరు నేషనల్ హైవే, దేవరపల్లి–అశ్వారావుపేట జాతీయరహదారి విస్తరణ పనులు పూర్తి చేసుకుని రాకపోకలకు సౌలభ్యంగా ఉన్నాయి. దేవరపల్లి–ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ నిధులు మంజూరు చేయడంతో దాదాపు ఏడాది నుంచి పనులు జరుగుతున్నాయి. మూడు జాతీయ రహదారుల ముఖ్యకూడలిగా దేవరపల్లి తయారు కావడంతో డివిజన్ స్థాయి ప్రభుత్వ కార్యాలయాలను ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో కార్యాలయాల ఏర్పాటుకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కార్యాలయాల భవనాల నిర్మాణానికి అధికారులు భూసేకరణ చేస్తున్నారు. ఇప్పటికే దేవరపల్లిలో పోలీస్ సర్కిల్ కార్యాలయం, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సర్కిల్ కార్యాలయం, సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశారు. రోడ్డు రవాణా శాఖ(ఆర్టీఓ) అధికారి కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు కార్యాలయాలకు అధికారులు స్థలసేకరణ పూర్తి చేయగా, శంకుస్థాపనకు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. శుక్రవారం జరిగిన కేబినేట్ సమావేశంలో దేవరపల్లిలో రోడ్లు భవనాల శాఖ డివిజన్ స్థాయి అధికారి కార్యాలయం మంజూరుకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. నియోజకవర్గంలోని నల్లజర్లలో గృహనిర్మాణశాఖ డీఈఈ కార్యాలయం, గోపాలపురంలో పంచాయతీరాజ్ శాఖ డీఈఈ కార్యాలయాలు ఉన్నాయి. రేపో, మాపో గౌరీపట్నంలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు కాబోతుంది.



తలారి వెంకట్రావు, గోపాలపురం ఎమ్మెల్యే

పథకాలను వివరించడమే లక్ష్యం

పెరవలి: కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు వివరించడమే భారత్ వికసిత్ సంకల్ప యాత్ర లక్ష్యమని మండల నిడదవోలు నియోజక వర్గ బీజేపీ అధ్యక్షులు సింహాద్రి సత్యనారాయణ తెలిపారు. పెరవలి మండలం తీపర్రు భారత్ వికసిత్ సంకల్ప యాత్ర సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా వేలాది మందికి ఉపాది లభిస్తుందని తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ హేమరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గర్భిణులకు అందించే సంక్షేమ పథకాల వల్ల అనేక మందికి ఆసరా లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రంగినీడి గంగాధర్, కరుటూరి సుబ్బారావు, బోగవల్లి సత్యనారాయణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు ఐదు ఫిర్యాదులు

కొవ్వూరు: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఐదు ఫిర్యాదులందాయని ఇన్‌చార్జి ఆర్డీవో రామావత్ కృష్ణనాయక్ తెలిపారు. భూమి వివరాలు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయాలని, పొలానికి దారి ఇవ్వాలని, కరెంట్ బిల్లు ఎక్కువ వస్తోందని, రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరారు. వాటిని పరిష్కారించాలని ఆయా శాఖలకు పంపించామన్నారు.

పోరాటయోధుడు సాబ్జి

నల్లజర్ల: ఉపాధ్యాయ హక్కుల పోరాటయోధుడు శాసన మండలి సభ్యుడు షేక్ సాబ్జి అని పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు పేర్కొన్నారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూలులో సోమవారం సాయంత్రం సాబ్జి మృతికి సంతాప సభ నిర్వహించారు. రిటైర్డు ఉపాధ్యాయుడు ఎస్.బాలయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా మొదలైన సాబ్జి ప్రస్థానం పోరాటాలనే మైలురాళ్లుగా చేసుకొని ఎమ్మెల్సీ స్థాయికి ఎదిగాడన్నారు. అనేక ఉద్యమాలకు ఊపిరిలూదిన సాబ్జీ పోరాటబాటలోనే అశువులు బాయడం తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఎస్ మనోహరకుమార్, ఎంఈఓలు వై.సత్యనారాయణ, భగవతిదేవి, డెమెక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి, శేషబ్రహ్మం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.శంకురుడు పాల్గొన్నారు.

న్యాయవాదుల రిలే దీక్షలు

కొవ్వూరు: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టం–2022ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు రిలే దీక్షలు చేశారు. ప్రజా, రైతుల వ్యతిరేకంగా ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ చీకటి చట్టం అమలు ద్వారా ప్రజల ఆస్తి హక్కులకు అ భద్రత ఏర్పడుతుందన్నారు.భూమి, భవన, స్థిరాస్తుల కబ్జాలకు గురవుతాయని, న్యాయవ్యవస్థకు ఉరి అంటూ ప్లకార్డు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 22వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగించనున్నట్టు బార్ అసోసియేషన్ బొబ్బా భారతీ తెలిపారు. కార్యదర్శి తక్కెళ్ల చిట్టిబాబు, న్యాయవాదులు పీవీపీ లక్ష్మి, వైవీ రాఘవులు,వై ప్రకాష్,టి రవీంద్ర, వీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జీఎస్ రావుని నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు హైదరాబాద్‌లో ఏఐజీ ఆసుపత్రిలో ఆదివారం రాత్రి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కరిబండి గన్నిరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు,దొమ్మేరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీరుకొండ సూర్య నారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు వరిగేటి సుధాకర్, నల్లాకుల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్టు

నిడదవోలు రూరల్: కంసాలిపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు సమిశ్రగూడెం ఏఎస్సై పరమహంస సోమవారం తెలిపారు. కంసాలిపాలెం, రావిమెట్లకు చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడి చేయగా 8 మందిని అరెస్టు చేసి రూ.3,990 నగదుతో పాటు 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

కోళ్లఫారం షెడ్ దగ్ధం

చాగల్లు: చిక్కాలలో కోళ్లఫారం షెడ్ అగ్నిప్రమాదంతో దగ్ధమైంది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన టి.గోపాలకృష్ణ, సుబ్బారావుకు చెందిన కోళ్లఫారం షెడ్, అందులో కోళ్లు, వాటి మేత బస్తాలు పూర్తిగా కాలిబుడిదయ్యాయి. ఈ ప్రమాదంలో అధిక మొత్తంలో ఆస్తినష్టం సంభవించిందని, విద్యుత్ షర్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.